సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం, 19, డిసెంబర్, 2022



అద్దంలా దారులు.. ఆనందంలో గిరిజనులు

అధ్వానంగా మారిన రెండు ప్రధాన రోడ్లకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చించింది.

8లో

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



సాక్షి, పాడేరు: జిల్లావ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. మినుములూరులో వద్ద 10 డిగ్రీలు, అరకులోయలో 15 డిగ్రీలు, చింతపల్లిలో 17 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అగ్ని ప్రమాదం.. రూ. 3 లక్షల ఆస్తి నష్టం



వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలులో జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం కాగా రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది.

8లో

న్యూస్‌రీల్

డొంకరాయి ఎస్‌ఐ, హెచ్‌సీ సస్పెన్షన్

ఏలూరు రేంజి డీఐజీ ఉత్వర్వులు జారీ

చింతూరు: చింతూరు సర్కిల్ డొంకరాయి పోలీసుస్టేషన్ ఎస్‌ఐ నర్సింహమూర్తి, హెడ్ కానిస్టేబుల్ నారాయణరావును సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిపై వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో ఉన్నతాధికారులు వారిపై ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

సీఎం జన్మదినం రోజున సేవా కార్యక్రమాలు

రంపచోడవరం

ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని నియోజకవర్గంలో ఈ నెల 21న వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. రంపచోడవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కేక్ కటింగ్, అనంతరం రక్తదాన శిబిరం ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో హెచ్‌డీఎస్ మీటింగ్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం ముసురుమిల్లి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తామని ఆమె వివరించారు. 19వ తేదీన అడ్డతీగలలో క్రికెట్ ,వాలీబాల్ ,కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20వ తేదీన గంగవరంలో మొక్కలు నాటే కార్య క్రమం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సీహెచ్‌సీ, పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జమల్‌బాషా

ముంచంగిపుట్టు: స్థానిక సీహెచ్‌సీ, కిలగాడ పీహెచ్‌సీని ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమల్‌బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆస్పత్రిలో వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులు, మందులు నిల్వలను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో ప్రసవాలు సంఖ్యను పెంచాలని, గర్భిణులకు అవగాహన కల్పించి, ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేవిధంగా కృషిచేయాలని కోరారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యసేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలోని వైద్యాధికారి శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మురిసిన లంబసింగి

- అధునిక సౌకర్యాలతో హరిత హిల్ రిసార్ట్స్
- అందుబాటులోకి రావడంతో పర్యాటకుల్లో ఆనందం
- ఉత్సాహం నింపిన పర్యాటకశాఖ మంత్రి రోజా ప్రసంగం
- ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని స్థానికుల ఆశ



మంత్రి రోజాకు స్వాగతం పలుకుతున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, సుభద్ర తదితరులు



గిరిజనులు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ మాధవితో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి రోజా

చింతపల్లి: ప్రముఖ పర్యాటక ప్రాంతం లంబసింగి మురిసిపోయింది. ఊహించని విధంగా ఇక్కడ వసతులు సమకూరుతుండటంతో పర్యాటకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్న సందర్భాలున్న లంబసింగిలో ఆధునిక వసతులు అందుబాటులోకి రావడంతో పర్యాటకుల తాకిడి మరింత పెరగనుంది. భూతల స్వర్గాన్ని తలపిస్తున్నఇక్కడి చెరువుల వేనం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పర్యాటకశాఖ మంత్రి రోజా ప్రకటించడంతో ఉపాధి మార్గాలు మెరుగుపడతాయని ఈ ప్రాంతీయుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

ప్రత్యేక ఆకర్షణగా హరిత హిల్ రిసార్ట్స్

లంబసింగిలో రూ.కోట్లతో నిర్మించిన హరిత హిల్ రిసార్ట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పర్యాటకశాఖ మంత్రి రోజా చేతులమీదుగా ప్రారంభమైన వీటిలో 11 ఏసీ సూట్లు, రెస్టారెంట్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. స్వదేశీ పర్యాటకులే కాకుండా విదేశీ పర్యాటకులనుఆకర్షించేలా ఇక్కడ సౌకర్యాలు ఉన్నాయి. పర్యాటకులు ఆన్‌లైన్‌లో వసతులను పొందే అవకాశం కల్పించారు. అతి శీతల వాతావరణానికి పెట్టింది పేరైన లంబసింగిలో రిసార్ట్స్‌కు వచ్చే పర్యాటకులకు ఉచితంగా అల్పాహారం, స్నానాలకు వేడినీళ్లు అందించనున్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో నిర్మించిన రిసార్ట్స్‌కు తలదన్నేలా ఇవి ఆకర్షిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ప్రతి రోజు కాలుష్య సమస్యలతో సతమతమయ్యే వారు ఇటువంటి ప్రాంతంలో ఒక్క రోజు కుటుంబ సమేతంగా బస చేసినా మనసుకు ఎంతో ఉల్లాసంగా ఉంటుందని మంత్రి రోజా పేర్కొన్నారు.

పరవశించిన రోజా

చామంతి సినిమాలో హీరోయిన్‌గా నటించిన ఆమె షూటింగ్ నిమిత్తం 1991లో లంబసింగి వచ్చారు. మంత్రిగా మళ్లీ ఇక్కడికి వచ్చిన ఆమె ఎంతో ఆనందానికి గురయ్యారు. ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. ఆమెకు గిరిజనులు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. దీంతో పులకించిన ఆమె వారితో కలిసి నృత్యం చేశారు. మంత్రి రోజాను చూసేందుకు గిరిజనులు భారీగా తరలివచ్చారు. దీంతో అభివాదం చేస్తూ వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నర్సింగరావు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, స్థానిక సర్పంచ్ శాంతికుమారి, ప్రాజెక్టు డివిజనల్ మేనేజర్ హరిత, ఈడీ మల్‌రెడ్డి, సీఈ మూర్తి, ఈఈ కె.రమణ, ఆపరేషన్స్ ఈడీ గోవిందరావు, ఏపీటీడీసీ డైరెక్టర్లు ఆర్.రేవతి. ఆర్.శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మంప, రాజేంద్రపాలెంలో నిర్మాణానికి ఎంపీపీ వినతి

కొయ్యూరు: మన్యం వీరుడు నడయాడిన మంప,రాజేంద్రపాలెం అల్లూరి స్మారక మందిరాలతో పాటు ప్రముఖ జలపాతాల వద్ద హరిత రిసార్ట్స్ ఏర్పాటు చేయాలని ఎంపీపీ బడుగు రమేష్ ఏపీ పర్యాటకాభివృద్ధి శాఖ ఎక్జుక్యూటివ్ డైరెక్టర్ ఏఎల్ మలిరెడ్డిని కోరారు. ఆదివారం లంబసింగి వచ్చిన ఆయనను కలిశారు. మన్యం సాయుధ పోరాటానికి కొయ్యూరు మండలం వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. మంపను వేదికగా చేసుకుని అల్లూరి బ్రిటిష్ సేనలపై తిరుగుబాటు చేసిన వైనాన్ని ఎంపీపీ వివరించారు. రాజేంద్రపాలెంలో అల్లూరిని కాల్చి చంపిన ప్రాంతాన్ని, మంపలో పట్టుబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కొయ్యూరుకు సమీపంలో రెండు జలపాతాలు ఉండడంతో వాటిని చూసేందుకు ఎక్కువ మంది వస్తున్నారని,అయితే సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ వివరించారు. ఈ ప్రాంతంలో హరిత రిసార్టులు నిర్మిస్తే పర్యాటకుల రాక మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దీనిపై పర్యాటకశాఖ ఏడీ సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు.



ఏపీటీడీసీ ఈడీ మలిరెడ్డితో మాట్లాడుతున్న ఎంపీపీ బడుగు రమేష్

మాస్టర్ అథ్లెటిక్స్‌లో బంగారు పతకాలు

ప్రతిభ కనబరిచిన ఆశ్రమ వ్యాయామఉపాధ్యాయులు



పతకాలు సాధించిన వ్యాయామఉపాధ్యాయులు

ఎటపాక: ఆంధ్రప్రదేశ్ 41వ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో విలీన మండలాల్లోని ఆశ్రమ పాఠశాలలకు చెందిన ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు బంగారు పతకాలు సాధించారు. నెల్లూరు జిల్లాలో సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 16,17 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో వారు ప్రతిభ కనబరిచారు. 40 సంవత్సరాల వయసుకు పైబడిన విభాగంలో హైజంప్‌లో వీఆర్ పురం మండలం సున్నవారిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.రమేష్, బంగారు పతకం సాధించారు. అదేవిదంగా జావెలిన్‌త్రో, లాంగ్ జంప్‌లో రెండు రజత పతకాలు కూడా రమేష్ సాదించాడు. ఎటపాక మండలం నల్లకుంట ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. నాగిరెడ్డి షాట్‌పుట్, రిలే పరుగు పందెంలో రెండు బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా జావెలిన్, డిస్కస్‌త్రోలో రెండు కాంస్య పతకాలు పొందారు.వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 19వరకు పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో జరగనున్న జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు.

మన్యం రామఫలానికి భలే డిమాండ్

- వంట్లమామిడి మార్కెట్లో భారీగా లావాదేవీలు
- మంచి ధర లభించడంతో గిరి రైతుల్లో ఆనందం
- పోటీపడి కొనుగోలు చేసిన వ్యాపారులు



రామఫలాలను సంచుల్లో నింపుతున్న గిరిజనులు



సంతకు రామఫలాలను మోసుకొని వస్తున్న గిరిజన మహిళ

సాక్షి, పాడేరు: రామఫలాలకు ప్రసిద్ధి చెందిన పాడేరు మండలం వంట్లమామిడి వారపు సంతలో ఆదివారం భారీగా వ్యాపారం జరిగింది. వంట్లమామిడి సమీపంలోని అనేక ప్రాంతాలకు చెందిన గిరిజన రైతులంతా రామఫలాలను బుట్టలతో తీసుకువచ్చి విక్రయించారు. సీతాఫలాలు పంట ముగిసిన తరుణంలోని ప్రస్తుతం రామఫలాల దిగుబడి రావడంతో వారికి ఆర్థిక ఆసరా ఏర్పడింది. మైదాన ప్రాంతాల్లో రామఫలాలకు మంచి డిమాండ్ ఉండడంతో మూడు వారాలుగా ఇక్కడ భారీగా వ్యాపారం జరుగుతోంది. సుమారు రామఫలాల (30) బుట్ట రూ.400 నుంచి రూ.600కు అమ్ముడైంది. ఇక్కడ కొనుగోలు చేసిన రామఫలాలను విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, హైదరాబాద్ మార్కెట్లకు తరలించారు.

మైదాన ప్రాంతాల్లో డిమాండ్



గిరిజన ప్రాంతంలోని పండే రామఫలాలకు రుచికరంగా ఉండడంతో మైదాన ప్రాంతాల్లో వీటిని అధికంగా కొనుగోలు చేస్తారు. దీంతో గిరిజన ప్రాంతంలోని కొనుగోలు చేసి మైదాన ప్రాంతంలోని అమ్మకాలు సాగిస్తున్నాం. ప్రతివారం వంద బుట్టల వరకు కొనుగోలు చేస్తున్నా.

–డొంకడ రాజారావు, పండ్ల వ్యాపారి, మాడుగుల

నిర్లక్ష్య ఉద్యోగులపై కొరడా!

- హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూవో, ఉపాధ్యాయుడు సస్పెన్షన్
- నోడల్ కలెక్టర్ మల్లికార్జున ఉత్తర్వుల జారీ

సాక్షి, పాడేరు: జిల్లాలోని పాడేరు ఐటీడీఏకు సంబంధించి రెండు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విధులు పట్ల నిర్లక్ష్యం వ్యవహరించిన హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూవో, ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నారు. పాడేరు మండలం డోకూలూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని హెచ్‌ఎం హేమచందర్, ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డిప్యూటీ వార్డెన్ సత్యారావులను సస్పెండ్ చేస్తూ నోడల్ కలెక్టర్ మల్లికార్జున్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల రెండోవ తేదీన డోకులూరు గిరిజన సంక్షేమ పాఠశాలలో చదువుతున్న పాంగి నవీన్ అనే విద్యార్థిని అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలోని ఇంటికి పంపించడంతో తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థి మృతిచెందినట్లుగా ఆరోపణలు వినిపించాయి. తల్లిదండ్రులు, పలు విద్యా సంఘాలు ఆరోపించాయి. ఈ సంఘటనపై విచారణ జరిపిన అధికారులు నోడల్ కలెక్టర్‌కు మల్లికార్జునకు నివేదిక అందజేయడంతో హెచ్‌ఎం, వార్డెన్‌పై శాఖాపరమైన చర్యలు చేపట్టారు. అలాగే డుంబ్రిగుడ మండలం కిల్లోగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలుచేయడం లేదని, తమకు పౌష్టికాహారం సక్రమంగా అందటం లేదని, విద్యార్థులు ఫిర్యాదులు చేయడంతో ఇటీవలే అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాఠశాలను సందర్శించారు. అదే సమయంలో మెనూ సక్రమంగా పెట్టకపోవడంపై కూడ ఫిర్యాదులు అందాయి. దీంతో ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ మెనూ అమలుపై విచారణ జరిపాలని, ఏటీడబ్ల్యూవోకు ఆదేశించారు. విచారణ అనంతరం హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా పనిచేస్తున్న శాంతవేణిని సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీ చేశారు.

లోదొడ్డి ప్రధానోపాధ్యాయుడు..

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి గిరిజనసంక్షేమ ఆశ్రమపాఠశాల ప్రధానోపాధ్యాయుడు మఠం సువర్ణకుమార్‌ను సస్పెండ్ అయినట్లు ఏటీడబ్ల్యూవో హాసిని ఆదివారం తెలిపారు. సువర్ణకుమార్ విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూక సర్పంచ్, వార్డుమెంబర్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఫిర్యాదు చేశారని ఆమె తెలిపారు. పీవో ఆదేశాల మేరకు విచారణ జరిపి నివేదిక సమర్పించడం జరిగిందన్నారు. దీంతో గిరిజనసంక్షేమశాఖ డీడీ హెచ్‌ఎంను సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆమె వివరించారు.అదే స్కూల్లో సీనియర్ ఉపాధ్యాయునికి హెచ్‌ఎంగా బాధ్యతలు అప్పగించామని ఆమె వెల్లడించారు.

గెలుపు ఓటములను పట్టించుకోవద్దు

- రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి రోజా
- సందడిగా ఆలిండియా ఆహ్వాన సీఎం కప్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: గెలుపోటములు సహజం.. జాతీయ స్థాయి పోటీకి ఎదగడం గెలుపుతో సమానం అని రాష్ట్ర పర్యాటక క్రీడల శాఖ మంత్రి ఆర్.కె.రోజా పేర్కొన్నారు. ఆలిండియా ఆహ్వాన సీఎం కప్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలను సాగరతీరంలోని ఫ్లడ్ లైట్ వెలుతురుతో ఆదివారం రాత్రి ఆమె ప్రారంభించారు. ఏ రంగంలోనైనా విజేతగా నిలవాలంటే పట్టుదల ఉండాలన్నారు. బాక్సింగ్ క్రీడలో రాణించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. విశాఖ ప్రత్యేక రైల్వే జోన్‌కోసం మంత్రి అమర్‌నాథ్‌తో కలిసి ఈ ప్రాంగణం నుంచే ఉద్యమించామని, రాజధానికి కోసం విశాఖ గర్జనలో పాల్గొన్నానని రోజా గుర్తు చేశారు. అంతేకాకుండా తన సినీ కెరీర్ ప్రారంభం నుంచి విశాఖ ప్రజలతో అనుబంధం ఉందన్నారు. విశాఖ వాసుల కష్ట సుఖాల్లో తాను తోడుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, రాష్ట్ర మారిటైమ్‌బోర్డ్ చైర్మన్, ఏపీ బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ చాంపియన్‌షిప్‌లో 14 రాష్ట్రాలకు చెందిన బాక్సర్లు సబ్‌జూనియర్, జూనియర్, యూత్, ఎలైట్ గ్రూప్‌ల్లో పోటీపడనున్నారు.



బాక్సింగ్ పోటీలను ప్రారంభించి జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణికి సరదాగా పంచ్ విసురుతున్న మంత్రి రోజా

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

చింతపల్లి రూరల్: మండలంలోని కిటుములకు చెందిన కాంగ్రెస్ ఎంపీటీసీ వనుము పద్మతో పాటు 50 కుటుంబాలకు చెందిన గిరిజనులు వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రల సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ఎంపీటీసీ పద్మ, 50 కుటుంబాల గిరిజనులు తెలిపారు. సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా ప్రజలకు అందించిన గొప్ప ప్రభుత్వంలో చేరుతున్నందుకు గర్వంగా ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్ వంతల పద్మ, వైస్ సర్పంచ్ సుర్ల అప్పారావు తదితరులు ఉన్నారు. వీరికి పార్టీ కండువాలను ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు.



పార్టీలోకి చేరుతున్న గిరిజనులు

పండగలా పర్యాటకం



చాపరాయి జలపాతం వద్ద పర్యాటకుల కోలాహలం

సాక్షి, పాడేరు: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో వీకెండ్ జోష్ నెలకొంది. వంజంగి హిల్స్ సందడిగా మారింది. భారీగా తరలిరావడంతో రద్దీ నెలకొంది. సూర్యోదయం, ప్రకృతి అందాలను తిలకించేందుకు వేకువజామున పర్యాటకులు తరలివచ్చారు. పొగమంచు అందాలకు ఫిదా అయ్యారు.

హుకుంపేట: సీతమ్మపర్వతం(జెండాకొండ) వద్ద అందాలు తిలకించేందుకు ఆదివారం పర్యటకులు భారీగా తరలివచ్చారు. వేకువజామునే కొండపైకి చేరుకుని మంచు అందాలు, అందమైన మేఘాలు, సూర్యోదయం ప్రకృతి రమణీయతను ఆస్వాదించారు. తేనెపట్టు గుహల వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం మైన చాపరాయి జలపాతం వద్ద ఆదివారం మైదన ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో జలపాతం తిలకించేందుకు పర్యాటకులు తరలిరావడంతో సందడి నెలకొంది.గిరి మహిళల థింసా నృత్యాలను తిలకించారు. బేంబూ చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి పర్యాటకుల తాకిడి నెలకొంది. విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలకు ఆదివారం సెలవు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేశారు. ఫొటోలు దిగి సందడి చేశారు.

సందడిగా సందర్శిత ప్రాంతాలు

మారేడుమిల్లిలో..

మారేడుమిల్లి: చుట్టూ ఎత్తయిన కొండలు, పాతాళానికి జారిపోయేలా లోయలు, గలగలపారే సెలయేళ్లు, పక్షులు కిలకిలారావాలు, వంపుసొంపుల రహదారులు, ఆహ్లాదకలిగించే చల్లని వాతావరణం, మనసును మైమరపించే ప్రకృతి రమణీయతకు నిలయం మారేడుమిల్లి. వీటిని ఆస్వాదించేందుకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో ఇక్కడకు తరలివచ్చారు. జలతరంగిణి, అమృతధార, జంగిల్ స్టార్, పాములేరు, వ్యూపాయిట్, వాలిసుగ్రీవ్ వనమూలికల ప్రదేశం, కాఫీతోటలు, తధితర పర్యాటక ప్రదేశాలు, గెస్ట్ హౌసులు టూరిస్టులతో నిండిపోయాయి. జలపాతాలలో చి జలకాలాడుతూ కేరింతలు కొడుతూ అనందంగా గడిపారు. యువత ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున గుహలను అందాలను వీక్షించేందుకు భారీగా పర్యాటకులు తరలిరావడంతో గుహలు ప్రాంగణం సందడిగా మారింది. మండలంలోని కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాలు పర్యాటకులతో కళకళలాడాయి. అరకు–విశాఖ ప్రధాన రహదారి అనుకుని ఉన్న కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ సందర్శికులతో సందడిగా మారింది.



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



చిట్టంపాడు జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



జెండాకొండ, తేనెపట్టు గుహాల వద్ద పర్యాటకుల సందడి



జెండాకొండాపై పర్యాటకుల కేరింతలు

క్లుప్తంగా

మహిళ అదృశ్యం


అదృశ్యమైన మలిరెడ్డి కుమారి(ఫైల్)

దేవరాపల్లి: మండలంలోని తారువ గ్రామానికి చెందిన మలిరెడ్డి కుమారి (51) అనే మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుమారి మానసిక స్థితి కొంతకాలంగా సరిగాలేదు. ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆమె బయటకు వెళ్లి పోయింది. అప్పటి నుంచి బంధువుల ఇళ్ల వద్ద, చుట్టు పక్కల గ్రామాల్లో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించ లేదు. దీంతో ఆమె భర్త, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మలిరెడ్డి మహలక్ష్మీనాయుడు ఆదివారం పోలీసులకు పిర్యాదు చేశారు. ఈమె ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు లేదా ఫోన్ నంబర్ 80086 56549 కు సమాచారం అందించాలని స్థానిక ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు.

800 లీటర్ల పులుపు ధ్వంసం


పులుపు ధ్వంసం చేస్తున్న కొత్తకోట పోలీసులు

రావికమతం: మండలంలో కొత్తకోట పోలీసు స్టేషన్ పరిధిలో జెడ్.బెన్నవరం కొండపై గల సారా తయారీ కేంద్రాలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ విభీషణరావు ఆధ్వర్యంలో 800 లీటర్ల సారా పులుపు, తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు.

అద్దంలా దారులు.. ఆనందంలో గిరిజనులు

- పర్యాటక ప్రాంతాలకు ప్రయాణం సాఫీగా
- పాడేరు-కిండంగి రింగు రోడ్డుకు రూ .1.40 కోట్లు
- లగిశపల్లి-వంజంగి రోడ్డుకు రూ.70లక్షలు
- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చొరవతో రోడ్ల సమస్యకు పరిష్కారం
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనులు, పర్యాటకుల కృతజ్ఞతలు


అభివృద్ధి చెందిన లగిశపల్లి-వంజంగి రోడ్డు


అందంగా దర్శనమిస్తున్న లగిశపల్లి-కిండంగి రోడ్డు

సాక్షి, పాడేరు: గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారిన పాడేరు మండలంలోని రెండు ప్రధాన రోడ్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారు. పాడేరు సెయింట్ ఆన్స్ కాన్వెంట్ నుంచి లగిశపల్లి, కాడెలి, కిండంగి మీదుగా నక్కలపుట్టు ఆర్అండ్‌బీ రోడ్డు వరకు రింగ్ రోడ్డు పూర్తిగా గోతులతో అధ్వానంగా మారింది. అలాగే ఇదే రోడ్డులోని లగిశపల్లి జంక్షన్ నుంచి వంజంగి ఊరు వరకు రోడ్డు పాడైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోని పాలకులు ఆయా రహదారుల అభివృద్ధిని పట్టించుకోలేదు. వంజంగి ప్రాంతం పర్యాటకంగా పేరొందడంతో పర్యాటకుల తాకిడి అనూహ్యంగా పెరిగింది. అయితే అధ్వాన రోడ్లతో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. అయితే కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు ఏజెన్సీలోను అభివృద్ధి పనులు జరగలేదు. ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గత ఏడాది సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు, అప్పటి పర్యాటకశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుల దృష్టికి రహదారుల పరిస్థితిని తీసుకువెళ్లారు. ప్రభుత్వం స్పందించి పంచాయతీరాజ్‌శాఖ(ప్రాజెక్ట్స్)కు నిధులు మంజూరు చేయడంతో ఇటీవల ఆయా రహదారుల పనులు చేపట్టి అందంగా నిర్మించారు. ఆర్అండ్‌బీశాఖ సుమారు రూ.50లక్షల వరకు తమ పరిధిలో రోడ్డుకు ఖర్చుపెట్టగా, ఇటీవల కొత్తపాడేరు చెట్టు జంక్షన్ నుంచి లగిశపల్లి మీదుగా కిండంగి వరకు 4.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.కోటి 40లక్షలు, లగిశపల్లి జంక్షన్ నుంచి వంజంగి గ్రామం వరకు 400మీటర్ల తారురోడ్డుకు రూ.70లక్షలతో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో అందంగా రోడ్లను నిర్మించింది. కల్వర్టు నిర్మాణం పూర్తి చేయగా, సీసీ రోడ్ల పనులు కూడా త్వరలో పూర్తి కానున్నాయి. దీంతో పాడేరు-కిండంగి రింగ్‌రోడ్డులో రెండు వైపుల నుంచి లగిశపల్లి మీదుగా వంజంగి పర్యాటక ప్రాంతానికి పర్యాటకుల వాహనాలు పరుగులు తీస్తున్నాయి.అలాగే లగిశపల్లి, కాడెలి, కిండంగి, వంజంగి పంచాయతీల గిరిజనులు కూడా రోడ్ల అభివృద్ధితో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకులు, గిరిజనులంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు థ్యాంక్స్ చెబుతున్నారు.

సంతోషంగా ఉంది



పాడేరు నుంచి నక్కలపుట్టు రింగు రోడ్డుతో పాటు, వంజంగి రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేయడం సంతోషంగా ఉంది.గత ఏడేళ్ల నుంచి అధ్వాన రోడ్లతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. పర్యాటకుల వాహనాల రాకపోకలకు అనేక అవస్థలు పడేవారు. బైక్‌లు, ఆటోలకు తరచూ ప్రమాదాలు జరిగేవి.ఈ రోడ్ల అభివృద్ధితో తమకు ఎంతో మేలు జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

-ఓ.సంజీవరావు, లగిశపల్లి గ్రామం, పాడేరు మండలం

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం


కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని నూకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఘటాలను ఊరేగించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినులు కోలాట ప్రదర్శ ఆకట్టుకుంది. స్థానిక మహిళలు కుమారి, లక్ష్మీ తదితరులు ఆయా విద్యార్థినులకు కోలాటంలో శిక్షణ ఇచ్చారు. కోలాట నృత్యాలు చేసిన చిన్నారులను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

అగ్ని ప్రమాదం.. రూ.3లక్షల ఆస్తి నష్టం

- నిరాశ్రయులైన మూడు కుటుంబాలు
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


బాధిత కుటుంబాలకు సాయమందిస్తున్న ఎంపీపీ ఆనందరావు, ప్రజాప్రతినిధులు, నేతలు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక పూరిల్లు దగ్ధమయ్యింది. బాధితులు సర్వం కోల్పోయి పూర్తిగా నిరాశ్రయులయ్యారు. ఇంట్లో నివాసముంటున్న మూడు కుటుంబాలకు చెందిన రూ.3లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. ఆదివారం మధ్యాహ్నం పొలం పనులకు వెళ్లి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం జరిగినట్టు బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. తహసీల్దార్ కె.సుధాకర్ స్పందిస్తు తక్షణ ఆదేశాలు జారీ చేయడంతో వీఆర్‌వో కాంతమ్మ, వీఆర్ఏ గొర్లె చిన్నబ్బులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్ని బాధితులు నిడమర్తి కుమారి, పేకేటి విజయకుమారి, నిడమర్తి జ్యోతి కుటుంబాలకు ప్రభుత్వ తక్షణ సహాయంగా బియ్యం, తదితర నిత్యావసర వస్తువులను జీసీసీ డిపో ద్వారా అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు బంటు షీలా గీతాంజలి బాధిత కుటుంబాలకు రూ.2 వేలు సాయమందించారు.

బాధిత కుటుంబాలకు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతల సాయం

చవిటిదిబ్బలు గ్రామ అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ఎంపీపీ కడబాల ఆనందరావు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించి ఓదార్చారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మూడు కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పక్కా ఇళ్లు మంజూరుకు గృహనిర్మాణ సంస్థ అధికారులకు తెలియజేస్తామన్నారు. అనంతరం బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదు సాయంగా అందజేశారు. వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ బచ్చలి చిన్నమ్ములు, వైఎస్సార్‌సీపీ నాయకులు భారతి బాబు, బాబి, తిరుపతిరెడ్డి, కనకరాజు, మాధవ, నూకరాజు, రమేష్, చిన్నబ్బాయి పాల్గొన్నారు.

పాలకేంద్రంలో చోరీ

అనకాపల్లిటౌన్: మండలంలోని బట్లపూడి విశాఖ డెయిరీ కేంద్రంలో ఈ నెల 15న చోరీ జరిగింది. కంప్యూటర్ సీపీయూ చోరీ అయినట్టు ఆ పాలకేంద్రం అధ్యక్షుడు గొంతిన సత్యారావు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు.

ఉత్సాహంగా హాకీ ఎంపిక పోటీలు


హాకీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

యలమంచిలి: స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. అనకాపలి జిలాల్ హాకీ అసోసియేషన్ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ మండలాల నుంచి వంద మంది బాలబాలికలు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసి, శిక్షణ ఇస్తామని అనకాపల్లి జిల్లా అడహక్ కమిటీ కో ఆర్డినేటర్ నరేష్ తెలిపారు.

టీవీ నటుల హాస్య ఛలోక్తులు


జబర్దస్త్ నటుడు సత్తిపండు, టీమ్ సభ్యులు నటిస్తున్న హాస్య సన్నివేశం

నర్సీపట్నం: పీఆర్టీయూ వన సమారాధన కార్యక్రమంలో జబర్దస్త్ టీం సభ్యులు హాస్య సన్నివేశాలతో అలరించారు. మున్సిపాలిటీ అప్పన్నదొరపాలెం ఎస్టేట్స్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. జబర్దస్త్ సత్తిపండు తన టీమ్ సభ్యులతో కలిసి ప్రదర్శించిన పలు హాస్య సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. పాడుతాతీయగా సింగర్ ధీరజ్ ఆలపించిన సినీ గేయాలు మంత్రముగ్ధుల్ని చేశాయి. పిల్లాపాపలతో ఉపాధ్యాయులు సరదాగా గడిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతోపాటు ఏటా ఇటువంటి వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్ పేర్కొన్నారు.

హంసవాహనంపై తిరువీధి సేవ

ఉపమాకలో ఘనంగా ధనుర్మాసోత్సవాలు



నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం హంస వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు. మూడోరోజు కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్‌కు వేకువజామునే నిత్యార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామిని హంసవాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు. అండాళ్లమ్మవారి సన్నిధిలో తిరుప్పావై మూడో పాశురాన్ని విన్నపం చేశారు. ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, నరసింహచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా వైజాగ్ మారథాన్



బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): ప్లాస్టిక్ , మత్తు పదార్థాల వలన కలిగే దుష్ప్రయోజనాలను వివరిస్తూ నగరప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో సంధ్యామెరైన్స్ వైజాగ్ మారథాన్ కార్యక్రమాన్ని సాగరతీరంలో నిర్వహించారు. ఈ మారథాన్ లో 21కె, 10కె, 5కె, 3కె నాలుగు విభాగాల్లో నిర్వహించారు. నగరవాసులతో పాటు దేశం నలుమూలలనుంచి వేల సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొన్నారు. ఉదయం 4 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం 9 గంటలవరకు కొనసాగింది, పాల్గొన్నవారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పోలీసు శాఖ ట్రాఫిక్‌ను నియంత్రించారు. అలాగే వలంటీర్లను, తక్షణ వైద్య సేవల కోసం డాక్టర్లను, అంబులెన్స్‌లను నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ వైజాగ్ రన్నర్స్ మొదటి సారిగా నిర్వహించిన కార్యక్రమానికి ఇంత పెద్ద ఎత్తున స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌లో విశాఖ, కర్నూలు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో క్వార్టర్ ఫైనల్స్‌కు విశాఖ, కర్నూలు జట్లు చేరుకున్నాయి. మున్సిపల్ స్టేడియంలో ఆదివారం ఈ పోటీలు ప్రారంభం కాగా పలు జిల్లాలకు చెందిన జట్లు పోటీపడుతున్నాయి. తొలిరోజు లీగ్ దశలు పోటీలు ఉత్సాహంగా సాగాయి.

చెట్టుకు ద్విచక్రవాహనం ఢీ కొని ఒకరి మృతి


ప్రమాదంలో మృతి చెందిన ఆనంద్(ఫైల్)


ప్రమాదానికి గురైన కార్లు

చింతపల్లి/చింతపల్లి రూరల్: మండలంలో ఆదివారం రెండు చోట్ల ప్రమాదాలు జరిగాయి. ఓ గిరిజన యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొమ్మంగి పంచాయతీ పార్లుబందకు చెందిన గెమ్మెలి ఆనంద్ (20), ఏటిగైరంపేటకు చెందిన సాయి ద్విచక్ర వాహనంపై లంబసింగి వైపునుంచి చింతపల్లి వస్తుండగా లోతుగెడ్డ జంక్షన్ వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కనున్న చెట్టును ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సాయికి తీవ్రంగా గాయాలు కావడంతో చింతపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరో ప్రమాదంలో లంబసింగి ఘాట్ రోడ్డులో రహదారి పక్కన ఆగి ఉన్న ఒక కారును వెనుక నుంచి వస్తున్న మరో కారు బలంగా ఢీ కొట్టింది. సంఘటనలో రెండు కార్లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి.

బాలికను మోసగించిన యువకునిపై పోక్సో కేసు

- గర్భవతిని చేసి పెళ్లికి నిరాకరణ
- నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

రావికమతం: బాలికను మోసం చేసి గర్భవతిని చేసిన ఒక యువకునిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు కొత్తకోట ఎస్‌ఐ విభీషణరావు ఆదివారం తెలిపారు. ఆయన అందించిన వివరాలు.. తండ్రి లేకపోవడం, తల్లి బతుకుతెరువుకు మరో దేశం వెళ్లడంతో బాధిత బాలిక దొండపూడి ఎస్సీ కాలనీలో అమ్మమ్మ, పిన్ని ఇంటి వద్ద ఉంటూ ఇంటర్ చదువుతోంది. అదే సామాజిక వర్గం, అదే ప్రాంతానికి చెందిన పులగుజ్జల శ్రీను (22) మాయమాటలతో వివాహం చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అవసరం తీర్చుకున్నాడు. దీంతో ఆమె ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భవతి. ఆ యువకుడు వేరే వివాహానికి సిద్ధపడటంతో ఆ బాలిక నిలదీసింది. పెద్దల ద్వారా ఎన్నో విధాలుగా నచ్చచెప్పినా వినకపోవడంతో కొత్తకోట పోలీసులను ఆశ్రయించింది. దీంతో కేసు నమోదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ సునీల్ విచారణ చేసి, కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. అయినా వినకపోవడంతో కేసు నమోదు చేసి ఆదివారం ఉదయం అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజాసంఘాలు అండగా రావాలని వినతి

తనను వివాహం చేసుకుంటానని మోసం చేసి, గర్భవతిని చేసిన అతనితో తనకు వివాహం అయ్యేలా ప్రజాసంఘాలు అండగా నిలవాలని బాధిత బాలిక కోరుతోంది. ఆయన అరెస్టయినంత మాత్రాన తనకు వచ్చేదేమీ లేదని, వివాహం చేసుకుంటానంటే కేసు ఉపసంహరించుకుంటానని చెబుతోంది. నిందితుడిని తప్పుదోవ పట్టిస్తున్న అతని తల్లి లక్ష్మి, మేనమామ అర్జున, అమ్మమ్మ చినతల్లి, అన్నయ్య హరిబాబులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతోంది.

రూ.54.04కోట్లతో అభివృద్ధి


అప్పన్న రాజగోపురం

- ప్రసాద్ స్కీమ్ పనులకు గ్రీన్‌సిగ్నల్
- పరిపాలనా అనుమతుల జారీ
- సింహాచలం దేవస్థానం అధికారులకు అందిన ఉత్తర్వులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రసాద్ స్కీమ్ ద్వారా చేయనున్న పలు అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ టూరిజం ఆదివారం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. రూ.54కోట్ల 4లక్షలతో పలు అభివృద్ధి పనులు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో త్వరలోనే పనులను ప్రారంభం కానున్నాయి. సింహాచలం దేవస్థానంలో ప్రసాద్ స్కీమ్ ద్వారా అభివృద్ధి పనులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు సబంధిత పనులపై కేంద్ర టూరిజంశాఖ నుంచి అధికారుల బృందం కూడా పలుమార్లు సింహాచలం వచ్చి భక్తుల సౌకర్యార్థం ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేయాలో పరిశీలించి ప్రణాళిక రూపొందించింది. ఎట్టకేలకు 54కోట్ల 4 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో రూ.4,78,45,000తో కొండదిగువ పాత పుష్కరిణి చౌల్ట్రీని అభివృద్ధి చేయనున్నారు. పుష్కరిణి సత్రం అభివృద్ధిలో భాగంగా ఆర్‌సీసీ నిర్మాణ పనులకు రూ.172.49లక్షలు, ఆర్టీకల్చర్ ఫినిషెస్‌కి రూ.224.63 లక్షలు, ఎంఈపీ ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సర్వీసెస్‌కి రూ.72.25లక్షలు, ల్యాండ్ స్కాపింగ్ (ఫ్రూట్ బేరింగ్ ట్రీస్, ఫ్లవర్ ప్లాంట్, లాన్స్‌లు) సంబంధించి రూ.9.08లక్షలతో పనులు చేయనున్నారు. మిగతా అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తి వివరాలు దేవస్థానానికి రెండు రోజుల్లో చేరనున్నాయి.